# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 03-02-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ప్రజా సంక్షేమానికి భారతీయ జనతా పార్టీ అధిక ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
2. ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాలలో డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలకు ఈరోజు ఎన్నికలు జరుగుతాయి.
3. తెలంగాణలో వెనుకబడిన తరగతులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో సామాజిక, కులగణన చేపట్టామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.
4. పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.
5. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రెండు వారాలలో ప్రకటించనున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

==========================

ప్రజా సంక్షేమానికి భారతీయ జనతా పార్టీ అధిక ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో బిజెపికి మద్దతుగా గత రాత్రి ఢిల్లీలోని షహదరాలో నిర్వహించిన బహిరంగ సభలో తెలుగువారిని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఢిల్లీ ప్రజల కోసం బిజెపి సంక్షేమ మ్యానిఫెస్టో తీసుకొచ్చిందని చెప్పారు. దేశాన్ని ముందుకు నడిపించడంలో తెలుగువారు అగ్రస్థానంలో ఉండాలన్నారు. ఢిల్లీ ప్రజలకు అభివృద్ధి సంక్షేమంతోపాటు మంచి జీవనప్రమాణాలు మెరుగుగా రావాలంటే బిజెపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్.. 30సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో త్వరితగతిన హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. నంద్యాలలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ... హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అనువైన భవనాన్ని ఎంపిక చేసేందుకు ఈ నెల 6వ తేదీన హైకోర్టు న్యాయమూర్తుల బృందం కర్నూలుకు వస్తున్నట్టు మంత్రి చెప్పారు. కర్నూలు దిన్నె దేవరపాడు వద్ద ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు చెందిన భవనాన్ని బృందం పరిశీలించనున్నట్టు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాలలో  డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలకు ఈరోజు ఎన్నికలు జరుగుతాయి. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ఎన్నికల సంఘం పూర్తి చేసింది. తిరుపతి, నెల్లూరు, ఏలూరు నగరపాలక సంస్థలకు డిప్యూటీ మేయర్లతో పాటు నందిగామ, హిందూపురం, పాలకొండ మునిసిపాలిటీల చైర్‌పర్సన్‌ల కోసం  ఎన్నికలు జరగనున్నాయి. అలాగే బుచ్చిరెడ్డిపాళెం, నూజివీడు, తుని, పిడుగురాళ్ల పురపాలక సంఘాలకు వైస్ ఛైర్ పర్సన్స్ ఎన్నిక నిర్వహించనున్నారు.

---------------------------

తెలంగాణలో వెనుకబడిన తరగతులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో సామాజిక, కులగణన చేపట్టామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రణాళికా విభాగం ప్రధాన కార్యదర్శి సందీప్ సుల్తానియా రాష్ట్రంలో కులగణన అంశంపై మంత్రివర్గ ఉపసంఘానికి నివేదికను నిన్న హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహీనవర్గాల అభ్యున్నతికి అవసరమైన వివరాల సేకరణకు కులగణన చేపట్టామని చెప్పారు. సామాజిక కులగణన సర్వేలో ఒక లక్షా 3 వేల 889 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారని అన్నారు 96.9శాతం మంది సర్వేలో పాల్గొని వివరాలు అందించారని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్.. 34 సెకన్లు

---------------------------

ఈ రోజు వసంత పంచమి పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. చదువుల తల్లి, జ్ఞానానికి అధి దేవతగా పురాణాలు పేర్కొనే సరస్వతీ దేవిని ప్రజలు ఈ సందర్భంగా పూజిస్తారు. వసంత పంచమిని శ్రీ పంచమి అని కూడా పిలుస్తారు. శ్రీ పంచమిని విద్యారంభ దినంగా కూడా భావిస్తారు. ఈరోజు పిల్లలకు అక్షరాభ్యాసం చేస్తే... వారు ఉన్నత విద్యావంతులు అవుతారని ప్రజల  విశ్వాసం. వసంత పంచమి కార్యక్రమంలో భాగంగా ప్రధానంగా తెలంగాణా రాష్ట్రంలోని బాసర క్షేత్రం, ఇతర సరస్వతీ ఆలయాలలో ఈరోజు పెద్ద ఎత్తున అక్షరా భ్యాసాలు జరుగుతున్నాయి. వసంత పంచమిని పురస్కరించుకొని ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాలో భక్తులు పెద ఎత్తున అమృత స్నానాలు ఆచరిస్తున్నారు.

---------------------------

కేంద్రబడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు ప్రాధాన్యం లభించిందని జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో  మంత్రి నిన్న మాట్లాడుతూ, కేంద్ర బడ్జెట్‌లో అమరావతి, పోలవరం, విశాఖపట్నం ఉక్కు కర్మాగారం, జలజీవన్ పథకం పొడిగింపు వంటి ప్రయోజనాలు కలిగాయని చెప్పారు. 990 కోట్లతో  డయాఫ్రం వాల్ నిర్మాణం ప్రారంభించి 2025 డిసెంబర్ కల్లా పూర్తి చేస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..28 సెకన్లు

---------------------------

పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అమరావతిలో మంత్రి నిన్న

పాత్రికేయులతో మాట్లాడుతూ, బడ్జెట్‌లోని అంశాలు మధ్యతరగతి ప్రజల అభివృద్ధికి తోడ్పడతాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పోలవరం ప్రాజెక్టు, ఓర్వకల్లు, కడప, శ్రీ సిటీ పారిశ్రామిక వాడల అభివృద్ధి కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించిందని తెలిపారు.

---------------------------

భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగిన ఐదు క్రికెట్ మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా గత రాత్రి జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ జట్టు విజయం సాధించింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్‌కు దిగిన భారత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. అనంతరం భారత్ నిర్దేశించిన 248 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ జట్టు 10.2 ఓవర్లలో 97 పరుగులకు ఆలౌట్ అయింది.దీంతో 150 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ ను ఓడించి భారత్ 4–1 తేడాతో సిరీస్‌ను గెలుచుకుంది.

మరో వైపు ఉత్తరాఖండ్ లోని డెహ్రాడూన్లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడల్లో మధ్యప్రదేశ్‌కు చెందిన షూటర్ ఆషి చౌక్సే మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో జాతీయ రికార్డును నెలకొల్పింది. 2023లో హాంగ్ ఆసియా క్రీడలలో 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్లలో రజతం, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్ లో రజతం సాధించిన 22 సంవత్సరాల చౌక్సే ప్రస్తుతం 598 పాయింట్లు సాధించి, 2023లో సిఫ్ట్ కౌర్ సమ్రా నెలకొల్పిన 594 రికార్డును అధిగమించింది.

---------------------------

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రెండు వారాలలో ప్రకటించనున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని విప్పలమడకలో మంత్రి నిన్న మాట్లాడుతూ, అర్హులకే ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ రానున్న క్రమంలో సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక జాబితాపై స్థానిక శాసనసభ్యుల స్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. పేద ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో శ్రీశ్యామలాంబ అమ్మవారి పండుగను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లపై సాలూరులో మంత్రి నిన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 18,19,20 తేదీల్లో మూడు రోజుల పాటు ఉత్సవాలను జరపనున్నామని చెప్పారు. ఈ ఉత్సవాల ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా నిర్వహించాలని మంత్రి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరుజిల్లా నగరి సమీపంలోని జాతీయ రహదారిపై గత అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. నగరి నుంచి తిరుపతికి వెళుతున్న ప్రైవేటు బస్సును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. మృతులు జిల్లాలోని వడమాల పేట, తిరుపతికి చెందిన వారిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ రోడ్డు ప్రమాదంపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

======================